

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 9 డిసెంబర్ 2025 పేజీలు 8


### మన హస్తకళా వైభవం..

# సాంస్కృతిక సౌరభం..



- హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమాలు
- ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జాతీయ హస్తకళా వారోత్సవాలు
- కళాకారులకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కృషి
- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 8, మేజర్ న్యూస్ : మన హస్తకళా వైభవం.. సాంస్కృతిక సౌరభాలకు నెలవని.. హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు, సాధికారత

మిగతా 2లో...




# నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం

- క్షతగాత్రుడిని కాపాడిన 5వ ట్రాఫిక్ సీఐ రవికుమార్

వివరాలు 2లో

## రౌడీ షీటర్ హత్య కేసులో నిందితుడు అరెస్ట్

హంతకుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన జగ్గయ్యపేట పోలీసులు 2



## మీకోసం అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలి




4 లో...

(మొదటిపేజీ తరువాయి)




## నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం

### క్షతగాత్రుడిని కాపాడిన 5వ ట్రాఫిక్ సీఐ రవికుమార్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలోని బెంజ్‌సర్కిల్ ఓల్డ్ ఫ్లైఓవర్ ఎండింగ్ వద్ద, మహానాడు నుండి స్క్రూ బ్రిడ్జ్ వైపు వెళ్లే రోడ్డులో నేడు భయానక రోడ్డు ప్రమాదం జరిగింది. కారుకు వెనుకగా వస్తున్న లారీ, ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో టు వీలర్ పూర్తిగా లారీ కింద ఇరుక్కుపోయింది. ప్రమాద తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని స్క్రూ బ్రిడ్జ్ పాయింట్ దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీసులకు చేరవేశారు వెంటనే 5వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్, కానిస్టేబుల్‌తో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ లారీ కింద చిక్కుకుపోయిన టు వీలర్ వ్యక్తిని ఎంతో కష్టపడి బయటకు తీసి,గాయపడిన అతనికి సీపీఆర్ ( ప్రథమ చికిత్స ) అందించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో, బాధితుడు ప్రాణాపాయం లోనున్న పరిస్థితిని గమనించిన సీఐ రవికుమార్ స్వయంగా ముందుకు వచ్చి ఒక ఆటోలో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) కి తరలించారు. ఈ ప్రమాద సమయంలో ట్రాఫిక్ పోలీసుల వేగవైన స్పందన, ముఖ్యంగా సీఐ రవికుమార్ చూపిన మానవతా దృక్పథం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

### వైసీపీ నేత పిచ్చేశ్వరరావు మాతృమూర్తి మరణం తీరని లోటు

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల పెద్దగూడెంకు చెందిన వై సిపి నేత దిరిశం పిచ్చేశ్వరరావు మాతృమూర్తి దిరిశం కోటేశ్వరమ్మ మరణం తీరని లోటు అని ఏఎంసీ మాజీ ఛైర్మన్ కడవకొల్లు నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పిచ్చేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేస్తూ, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముందుగా కోటేశ్వరమ్మ చిత్రపటానికి పూల దండ వేసి నివాళులర్పించారు. వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జుజ్జువరపు భాగ్యారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్నా ప్రసాద్, లీగల్ సెల్ నేత సనకా ప్రభాకరరావు, రైతు నాయకులు కుందేటి కోటేశ్వరరావు, సీనియర్ నేత తోట ప్రసాద్, నేతలు దేవినేని విజయ్ కుమార్, దిరిశం సీతయ్య, దిరిశం శ్రీను, మేరుగు ప్రకాశరావు, స్థానికులు ఉన్నారు.

### మెయిల్ చొరవతో కొతవరం - దోకిపర్రు రోడ్డుకు మహర్దశ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) చొరవతో కౌత వరం - దోకిపర్రు రోడ్డుకు మోక్షం వచ్చి మహర్దశ పట్టింది. ప్రభుత్వానికి మెయిల్ సంస్థ వారు ఏళ్ల తరబడి అనేక గ్రామాల ప్రజల ఇక్కట్లను విన్న వించటంతో తారురోడ్డును నిర్మించారు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ఆనేక ప్రాంతాల ప్రజలు ఈ రోడ్డు నిర్మాణంతో మెయిల్ అధినేత, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏళ్ల తరబడి ఈ రోడ్డు నిర్మాణం పరిస్థితి అగమ్య గోచరంగానే తయారయ్యిందన్నారు. ఈ పనులను చేసిన ఆ రోడ్డును కాంట్రాక్టర్ కూడా వదిలేసి పనులు చేయకుండా కనబడకుండా పోయారన్నారు. కృష్ణారెడ్డి చొరవతో అనేక గ్రామాల ప్రజలకు దారి ఏర్పడిందని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

### స్క్రబ్ టైఫస్ బాధితుల పరామర్శ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులోని సింగలూరు రోడ్డులో స్క్రబ్ టైఫస్ వ్యాధి భాదితులను సోమవారం ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ పరామర్శిం చారు. ఆయనతో పాటు గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ యశస్విని ఈ సందర్భంగా బాధితుల ఇంటి చుట్టుపక్కల నిర్వహించి న శానిటేషన్, చెత్త పరిశుభ్రత చర్యలు, దోమలు, పురుగుల నియంత్రణ చర్యలను పరిశీలించారు. అలాగే మండలంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామ పంచాయతీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు సమన్వయంతో గ్రామాల్లో నిరంతర పరిశుభ్రత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ ఇమ్రాన్ ఆదేశించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పీహెచ్‌సీని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## మన హస్తకళా వైభవం.. సాంస్కృతిక సౌరభం..

(మొదటిపేజీ తరువాయి)

కల్పించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో కృషిచేస్తోందని, ఇందులో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్‌డీసీ) ఛైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ సోమవారం నగరంలోని గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో మీడియా సమా వేశంలో మాట్లాడారు. జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. ఈ నెల 10న వైఎస్ఆర్ కడప జిల్లా, వోనిపెంటలో గురుశిష్య హస్త్‌శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జీఎస్‌హెచ్‌పీపీ) ద్వారా 30 మంది ఇత్తడి, కంచులోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా, దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ అభివృద్ధి వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా, మాధవమాల, శ్రీకాళహస్తిలో కలప చెక్క కళాకారులకు టూల్ కిట్ల పంపిణీ, 14న అనకాపల్లి జిల్లా, కె.డి.పేటలో 50 మంది కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, డిసెంబర్ 15–21లో రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులతో ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డలో 50 మంది శిలా శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుం దన్నారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 9న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరగనుందని, మన రాష్ట్రం నుంచి ముగ్గురు కళాకారులు అవార్డులు అందుకోనుండటం మనకు గర్వకారణమన్నారు.



డి.శివమ్మ (తోలుబొమ్మలాట, శిల్పగురు అవార్డు), గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు, జాతీయ అవార్డు 2024, పి.విజయలక్ష్మి (కలంకారి హ్యాండ్ పెయింటింగ్, జాతీయ హస్తకళా అవార్డు 2023)లు గౌరవ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు. గౌరవ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్యులు ఎస్.సవిత, చేనేత, హస్తకళల గౌరవ సలహాదారు సుచిత్రా ఎల్లా, అధికారులు రాష్ట్రంలో హస్తకళల అభివృద్ధికి, హస్తకళాకారుల సంక్షేమానికి విశేష కృషిచేస్తున్నారని, ఇందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కళాకారులకు అవసరమైన చెక్కను అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంక్‌లను అందుబాటులోకి తేవడం జరుగుతోందని డా. పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐవీ లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ హత్య కేసులో నిందితుడు అరెస్ట్

### నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన జగ్గయ్యపేట పోలీసులు



**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** పట్టణంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి కార్యాలయంలో సోమవారం ఏసీపీ ఏబిజి తిలక్ అధ్యక్షతన పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ రాత్రి ధర్మవరప్పాడు తండా వద్ద రాంకో ఫ్యాక్టరీ పక్కన లేబర్ కాలనీకి వెళ్లె రోడ్డులోని పొలాలలో జరిగిన మద్యం పార్టీలో విజయవాడకు చెందిన యువకుడు అలవాల నవీన్ రెడ్డి దారుణ హత్యకు గురైనాడు అనే విషయం విధితమే. తన స్నేహితుడు చిల్లకల్లు గ్రామానికి చెందిన ఇనపనూరి అన్వేష్ ఏర్పాటు చేసిన పార్టీలో, నిందితుడు గాదె సాయి కృష్ణ అలియాస్ పిల్ల సాయి, మృతుడు నవీన్ పాల్గొన్నారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని, పరస్పరం దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో రెచ్చిపోయిన నిందితుడు బీర్ బాటిల్ పగులగొట్టి నవీన్ కంఠంపై పొడవడంతో, నవీన్ తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. హాస్పిటల్ కి అక్కడ ఉన్న వ్యక్తులు తరలించగా, డాక్టర్ మరణించినట్లు ప్రకటించారు అని తెలిపారు. ఈ సంఘటనలోని నిందితుడు సాయి కృష్ణ ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని విజయవాడ సిటీ లోని పలు పోలీస్ స్టేషన్ ల పరిధిలో దొంగతనం, కొట్లాట, హత్యాయత్నం, గంజాయి వంటి అనేక నేరాలలో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. అతనిపై కృష్ణలంక పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ కూడా ఉంది. మృతుడు నవీన్ కూడా పలు దొంగతన కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్య కేసును తీవ్రంగా పరిగణించిన ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నిందితుడిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. రూరల్ డి.సి.పి. బి. లక్ష్మీనారాయణ, ఐ.పి.ఎస్. పర్యవేక్షణలో, నందిగామ సబ్-డివిజన్ ఎ.సి.పి. తిలక్ ఆధ్వర్యంలో, జగ్గయ్యపేట ఇన్స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు వారి సిబ్బందితో కలిసి 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, సోమవారం 08.12.2025, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు తన నేరాన్ని ఒప్పుకున్నాడు అని అన్నారు. ఈ హత్య తాగిన మత్తు మైకంలో జరిగిందని అన్నారు. ఈ వ్యక్తులు మధ్య ఎలాంటి పాత కక్షలు లేవన్నారు. నిందితుడు గాదె సాయి కృష్ణ అలియాస్ పిల్ల కృష్ణ అలియాస్ పిల్ల సాయి అలియాస్ సాయి, వయస్సు 24 సంవత్సరాలు, రాజీవ్ కాలనీ, కృష్ణలంక, విజయవాడ సిటీ అని తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్.ఐలు టి.సూర్య శ్రీనివాస్,ఎస్. నాగ సాయి మణికంఠ, వారి సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించడం జరుగుతుందన్నారు.

## వెల్లువెత్తిన సహకార ఉద్యోగుల ఆందోళన



**గుడ్లవల్లేరు డిసెంబర్ 08 మేజర్ న్యూస్:** మండలంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు తమ డిమాండ్లపై చేసిన ఆందోళన వెల్లువెత్తింది. సోమవారం గుడ్లవల్లేరు కేడీసీసీ బ్యాంక్ ఎదుట తమ డిమాండ్లకు చెందిన ప్లకార్డులతో దీక్ష చేశారు. జీవో నెంబర్ 36ను వెంటనే అమలు పరిచి 2019, 2024 తాలుకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని సహకార ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉప కార్యదర్శి పుల్లేటి నాగ మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సీలింగ్ విధించి... రూ.2లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలు పరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు చేయాలన్నారు. సహకార సంఘాలలో పని చేసే ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లను అమలు పరచాలని కోరారు. ఉద్యోగులకు రూ.5లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. ఉద్యోగి సర్వీస్‌లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారము లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి రూ.20లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. అనేక సంఘాలలో ఉద్యోగుల జీతాలను ద్యూటులో ఉంచడం జరిగిందన్నారు. ఉద్యోగుల ద్యూటు పద్దులను రద్దు చెయ్యాన్నారు. 2019 తరువాత సంఘాలలో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా కాకుండా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలను డైరెక్ట్‌గా ఇస్తున్నారన్నారు. దీని వలన రైతులకు సరైన సమయంలో అప్పు దొరక్క పోవడమే కాకుండా ఆ ఏరియా పీఏసీఎస్ నిర్వీర్యం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని మార్పు చేసి అన్నీ సేవలు సహకార సంఘాల ద్వారా రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఏటా వారు చెల్లించిన షేరు ధనంపై డివిడెండ్ లేదా కనీసం 6శాతం వడ్డీ చెల్లించాలని అడిగారు, వెంటనే దీనిపై చర్య తీసుకొని 2011వ సంవత్సరము నుండి చెల్లించవలసిన డివిడెండ్ లేదా వడ్డీ చెల్లించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన దీక్షలో సహకార ఉద్యోగుల సంఘ గుడ్లవల్లేరు బ్రాంచి ఆర్గనైజర్ ఆర్.ఆంజనేయులు, దోకిపర్రు కార్యదర్శి టి.ఏడుకొండలు, గుడ్లవల్లేరు కార్యదర్శి అన్నం గిరిధర్ కుమార్, శేరీ కల్వపూడి కార్యదర్శి ఎం.రమేష్, పెంజెండ్ర కార్యదర్శి తోట లక్ష్మీ ఉష, వడ్లమన్నాడు కార్యదర్శి ఎస్.సురేష్, చంద్రాల కార్యదర్శి చిట్టిబొమ్మ హరీ ష్, కౌతవరం కార్యదర్శి వి.భరత్‌కుమార్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్లో బై కీర్తిలాల్స్ 'నేచర్ & డ్రీమ్స్' విజేతలకు బహుమతులు ప్రధానం



**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని చిన్నారులకు ఇటీవల నిర్వహించిన 'నేచర్ & డ్రీమ్స్' డ్రాయింగ్ పోటీ విజేతల బహుమతి ప్రధానోత్సవం గ్లో బై కీర్తిలాల్స్ షోరూమ్ లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టోర్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ గ్లో బై కీర్తిలాల్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చిన్నారులకు నిర్వహిస్తున్న పోటీలలో భాగంగా విజయవాడ గ్లో బై కీర్తిలాల్స్ షోరూమ్ ఆధ్వర్యంలో కూడా నేచర్ & డ్రీమ్స్' పేరుతో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలను ప్రకృతి పట్ల వారి భావనలను, వారు ఊహించే కలల ప్రపంచాన్ని చిత్రాల ద్వారా వ్యక్తీకరించేందుకు ఆహ్వానించిన ఈ పోటీకి నగరవాసుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ ప్రాంతం నుండి వచ్చిన సమర్పణలు శక్తివంతమైన ఊహ, వారి ఆశావాద దృక్పథాలను ప్రతిబింబించాయన్నారు. సమగ్ర పరిశీలన అనంతరం, ముగ్గురు చిన్న కళాకారులు ను విజేతలుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. యువ సృజనాత్మకతను పెంపొందించడాన్ని, కుటుంబాలతో అర్థవంతమైన అనుబంధాలను నిర్మించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఈ పోటీ కీర్తిలాల్స్ యొక్క పిల్లల కేంద్రీకృత చొరవ లిటిల్ డాజిల్' కింద నిర్వహించబడిందన్నారు. ఈ సందర్భంగా బ్రాండ్ ది నెక్లెస్ ఎడిట్ ను ఆవిష్కరించిందన్నారు. ఇది శుద్ధి చేసిన సిల్హౌట్లు, ఆధునిక హస్తకళను కలిగి ఉన్న సమకాలీన డైమండ్ నెక్లెస్ల సేకరణ అని చెప్పారు. ప్రారంభానికి గుర్తుగా, గ్లో బై కీర్తిలాల్స్ డైమండ్లపై ప్రత్యేక 30 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. జెన్ జెడ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన బ్రాండ్‌గా, గ్లో బై కీర్తిలాల్స్ వ్యక్తీకరణాత్మక డిజైన్లను, యవ్వన ఆధునికతను, నిపుణ హస్తకళను సమ్మిళితం చేస్తూ నేటి తరానికి అనుగుణమైన ఆభరణాలు, అనుభవాలని నిరంతరం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల అందజేశారు. మొదటి అవార్డు ను విజేత బాలిక డి యశస్విని కి గ్లో డిజైన్ స్టూడియో ప్రత్యేకంగా రూపకల్పన చేసిన ప్రత్యేక వజ్రాల ఆభరణం బహుమతిగా అందజేశారు. రెండవ బహుమతి ఎం భువన, మూడో బహుమతి ఎస్ కే జాస్మిన్ లకి అందజేశారు. వారితోపాటు ఫైనలిస్టులకు వారి సృజనాత్మక ప్రయాణాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రీమియం పియానో ప్లేయర్లు బహుమతులుగా అందజేశారు.

# బిపిఐఎన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో బ్రాండ్ భాగస్వామ్యాన్ని మరో 15 సం.లు పొడిగించిన బ్లాపుంక్ట్

**విజయవాడ, నవంబర్ 8, మేజర్ న్యూస్ :** కార్ ఇన్ఫోటైన్మెంట్, ఆడియో యాక్సెసరీస్‌లో ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయమైన పేరున్న బ్లాపుంక్ట్, బిపిఐఎన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తన దీర్ఘకాల లైసెన్సింగ్ భాగస్వామ్యాన్ని 2041 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ వ్యూహాత్మక పునరుద్ధరణ భారతీయ వినియోగదారులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి ఆటోమోటివ్ పరిష్కారాలను అందించడానికి ఆవిష్కరణ, నమ్మకం, భాగస్వామ్య దృక్పథంపై నిర్మించిన 27 సం.ల సహకారం యొక్క కొనసాగింపును సూచిస్తుంది. నరుద్ధరించబడిన ఒప్పందం భారతదేశం యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్ పర్యావరణ వ్యవస్థ పట్ల బ్లాపుంక్ట్ యొక్క నిబద్ధతను బలోపేతం చేస్తుంది, కీలక వృద్ధి భాగస్వామిగా బిపిఐఎన్ పాత్రను నొక్కి చెబుతుంది.



కార్ ఆడియో, కార్ యాక్సెసరీస్ రెండింటినీ కవర్ చేస్తూ, ఉత్పత్తి లభ్యతను పెంచడానికి, అధిక-పనితీరు గల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్‌ల కోసం పెరుగుతున్న డిమాం డ్‌ను తీర్చడానికి ఓఈఎంలు, ఆఫ్టర్‌మార్కెట్‌తో లోతైన సహకారాన్ని నడిపిం చడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. "భారతదేశం బ్లాపుంక్ట్ కోసం అత్యంత ఉత్తేజ కరమైన, ఆశాజనకమైన మార్కెట్లలో ఒకటిగా కొనసాగుతోంది" అని బిపిఐఎన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ జగ్వానీ అన్నారు. లిమిటెడ్. "భారతీయ రోడ్లకు ప్రపంచ ఆవిష్కరణలను తీసుకురావాలనే మా ఉమ్మడి దృక్పథాన్ని ఈ పొడిగింపు పునరుద్ఘాటిస్తుంది. పనితీరు, విశ్వసనీయత, ప్రీమి యం నాణ్యతను కోరుకునే ఓఈఎంలు, కార్ల యజమానులకు బ్లాపుంక్ట్‌ను అగ్ర ఎంపికగా మార్చడమే మా లక్ష్యం." బ్లాపుంక్ట్ ప్రధాన కార్యాలయం తరపున మాట్లాడుతూ, థోర్స్టెన్ గెబార్ట్ ఇలా అన్నారు: "బిపిఐఎన్తో ఈ పునరుద్ధరించబడిన ఒప్పందం భారతదేశంలో మా భాగస్వామ్యం యొక్క బలం, దీర్ఘాయువును ప్రతిబింబిస్తుంది," అని లైసెన్సింగ్ డైరెక్టర్ అయిన గెబార్ట్ కొనసాగించారు "దాదాపు మూడు దశాబ్దాలుగా, ప్రపంచంలోని అత్యంత డైనమిక్ ఆటోమోటివ్ మార్కెట్లలో ఒకటైన బ్లాపంక్ట్ నాణ్యత, ఆవిష్కరణ, కస్టమర్ విశ్వాసం కోసం బలమైన ఖ్యాతిని నిర్మించడంలో బిపిఐఎన్ కీలక పాత్ర పోషించింది. ఈ పొడిగింపుతో, మేము మా భాగస్వామ్య చరిత్ర, స్నేహాన్ని జరుపుకోవడమే కాకుండా, భారతీయ వినియోగదారుల కోసం తదుపరి తరం స్మార్ట్, కనెక్ట్ చేయబడిన ఇన్-కార్ ఇన్ఫోటైన్మెంట్, అనుబంధ పరిష్కారాలకు పునాది వేస్తున్నాము."

# రుసల్ అధిక పనితీరు గల గ్రీన్ అల్యూమినియం ఉత్పత్తులతో శక్తి పరివర్తనకు మద్దతు

**విజయవాడ, డిసెంబర్ 08, మేజర్ న్యూస్ :** ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకటైన రుసల్, భారతదేశాన్ని దాని తక్కువ-కార్బన్ అల్యూమినియం ఉత్పత్తులకు, ముఖ్యంగా దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యుత్ రంగంలో కీలకమైన అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా భావిస్తోంది. రష్యాకు చెందిన తక్కువ-కార్బన్ అల్యూమినియం మేజర్, అధిక-పనితీరు గల, స్థిరమైన పదార్థాలను సరఫరా చేయడం ద్వారా ఆధునిక ఇంధన మౌలిక సదుపాయాలలో భారతదేశం యొక్క గణనీయమైన పెట్టుబడులకు మద్దతు ఇవ్వడంలో తన పాత్రను చూస్తుంది. భారతదేశం యొక్క విస్తరిస్తున్న విద్యుత్ మౌలిక సదుపాయాల ప్రత్యేక అవసరాలను తీర్చడానికి, రుసల్ వినూత్నమైన, అధిక-పనితీరు గల ఉత్పత్తులను అభివృద్ధి చేసింది. కంపెనీ సాంకేతికంగా స్వచ్ఛమైన అల్యూమినియంతో పోలిస్తే ఉన్నతమైన బలం, కంపన నిరోధకతను కలిగి ఉన్న వినూత్న అల్యూమినియం-స్కాండియం వైర్ రాడ్‌ను అభివృద్ధి చేసి ఉత్పత్తి చేసింది, అదే సమయంలో అధిక విద్యుత్ వాహకతను నిర్వహిస్తుంది. ఈ ప్రత్యేక లోహం ప్రత్యేకంగా బస్‌బార్లు, ఎలక్ట్రికల్ వైరింగ్‌లో సాధారణంగా ఉపయోగించే రాగి పరిష్కారాలకు తేలికైన ప్రత్యామ్నాయంగా రూపొందించబడింది. ఈ అధిక-స్పెసిఫికేషన్, తక్కువ-కార్బన్ ఉత్పత్తుల ద్వారా, భారతదేశం యొక్క ఎలక్ట్రికల్ గ్రిడ్ ఆధునీకరణ, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల విస్తరిస్తున్న అవసరాలను తీర్చడానికి రుసల్ బాగా స్థానంలో ఉంది. రుసల్ ప్రాంతీయ అమ్మకాల డైరెక్టర్ రోమన్ బోరిసోవ్ మాట్లాడుతూ, 'భారతదేశం తక్కువ కార్బన్ అల్యూమినియంకు కీలక కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది,, సాంకేతికత, నైపుణ్యం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలతో ఆ మార్పుకు మద్దతు ఇవ్వడం మా పాత్ర. 99 శాతానికి పైగా పునరుత్పాదక శక్తితో ఉత్పత్తి చేయబడిన విలువ ఆధారిత ఉత్పత్తుల యొక్క పూర్తి శ్రేణిని అందించడం ద్వారా, మా భారతీయ కస్టమర్లు వారి ఈఎస్ జి పనితీరును బలోపేతం చేయడానికి, ప్రపంచ విలువ గొలుసులలో వారి పోటీతత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. మా సాంకేతిక, స్థిరత్వ మద్దతుతో కలిసి, ఇది భారతదేశంలో దీర్ఘకాలికంగా పర్యావరణ అనుకూల అల్యూమినియం పరిశ్రమకు బలమైన పునాదిని సృష్టిస్తుంది.' ప్రపంచవ్యాప్తంగా, విద్యుత్ రంగం గత సంవత్సరం బలమైన డిమాండ్‌ను ప్రదర్శించింది, ఇది మొత్తం అల్యూమినియం వినియోగంలో 16.3% వాటాను కలిగి ఉంది. ఈ ధోరణి ఇంధన మౌలిక సదుపాయాలు, స్వచ్ఛమైన శక్తిలో పెద్ద ఎత్తున పెట్టుబడుల ద్వారా నడపబడుతుంది, 2024లో ప్రపంచ పెట్టుబడులు యుఎస్ డి 2 ట్రిలియన్లను మించిపోయాయి. రుసల్ కి భారతదేశం వ్యూహాత్మకంగా ముఖ్యమైన మార్కెట్‌గా ఉంది. పునరుత్పాదక ఇంధన వనరులపై ఆధారపడటంలో కంపెనీ పోటీతత్వం ఉంది, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తక్కువ-కార్బన్ అల్యూమినియం ఉత్పత్తిదారుగా నిలిచింది. మొత్తంమీద, రుసల్ యొక్క లోహ ఉత్పత్తిలో ఉపయోగించే విద్యుత్‌లో 99% కంటే ఎక్కువ పునరుత్పాదక వనరుల నుండి వస్తుంది. రుసల్ దాని ఎఎల్ఎల్ఓడబ్ల్యూ బ్రాండ్ క్రింద తక్కువ-కార్బన్ అల్యూమినియంను మార్కెట్ చేస్తుంది, ఇది టన్ను లోహానికి 2.2 టన్నుల కంటే తక్కువ కార్బన్ సమానమైన సర్టిఫైడ్ కార్బన్ పాదముద్రను కలిగి ఉంది – ఇది పరిశ్రమ సగటు కంటే నాలుగు నుండి ఐదు రెట్లు తక్కువ.



## పొగాకు హాని తగ్గింపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ విధానాలపై సీవోపీ11 చర్చ

**విజయవాడ మేజర్ న్యూస్ :** జెనీవాలో జరిగిన పొగాకు నియంత్రణపై ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కి సంబంధించిన 11వ పార్టీల సదస్సు (సీవోపీ11) చర్చనీయాంశంగా మారింది. పొగాకు హాని తగ్గింపుపై శాస్త్రీయ ఆధారాలకు, సభ్య దేశాలకు పొగాకు నియంత్రణ దిశకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిస్పందనపై సందేహాలను లేవనెత్తింది. సీవోపీ11 సందర్భంగా, పొగాకు నియంత్రణ సైంటిఫిక్ సముదాయం ప్రపంచ ఆరోగ్య సంస్థ వైఖరికి వ్యతిరేకంగా మాట్లాడింది. పొగలేని పొగాకు ఉత్పత్తులు, సంప్రదాయ సిగరెట్ల విషపూరితతను సమానం చేసే ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యూహం ప్రపంచం ధూమపానంతో ఏడాదికి 8మిలియన్ల మరణాలను తగ్గించే అవకాశాన్ని కోల్పోయేలా చేస్తుందని ఫార్మకాలజీ, టాక్సికాలజీ, ప్రజారోగ్య విధాన రంగాలలో 50 మందికి పైగా స్వతంత్ర నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఎప్పటికీ అంతం కాని యుద్ధం, సంపూర్ణ నికోటిన్ వ్యతిరేక ప్రచారాలలో అపరిమిత పెట్టుబడికి బదులుగా, మనకు సైంటిఫిక్ ఆధారాల ఆధారంగా ఒక సౌకర్యవంతమైన ప్రజారోగ్య వ్యూహం అవసరం, ఇది ప్రజారోగ్యాన్ని కాపాడుతుండగా, భవిష్యత్తులో ప్రపంచ ఆరోగ్య సంక్షోభాలకు ప్రతిస్పందించే సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది.

## సోనీ నుంచి ఐదవ తరం ఏఎల్సీఈ-7వి




**విజయవాడ మేజర్ న్యూస్ :** సోనీ ఇండియా ఇప్పుడు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐదవ తరం ఏఎల్సీఈ-7విని పరిచయం చేసింది. దాదాపు 33.0 ప్రభావవంతమైన ఎంపితో కొత్తగా అభివృద్ధి చేయబడిన, పాక్షికంగా స్టాక్ చేయబడిన ఎక్స్మోర్ ఆర్ఎస్ సిఎంవోఎస్ ఇమేజ్ సెన్సార్ ద్వారా శక్తిని పొందుపరచబడిన ప్రసిద్ధ ఆల్ఫా 7 ఫుల్-ఫ్రేమ్ మిర్రర్‌లెస్ లైనప్‌లో ఇది తీర్చిదిద్దబడింది. కొత్త ఇమేజ్ ప్రాసెసింగ్ ఇంజిన్ బియాంజ్ ఎక్స్ఆర్2 తాజా ఆల్ఫా సిరీస్ ఏఐ ప్రాసెసింగ్ యూనిట్ ఫంక్షన్‌లను కలిగి ఉంటుంది. ఈ ఆవిష్కరణల ద్వారా, ఐఎల్సీఈ-7వి రియల్-టైమ్ రికగ్నిషన్ ఆటో-ఫోకస్ నుండి రియల్-టైమ్ ట్రాకింగ్, వేగం, స్థిరమైన రంగు ఖచ్చితత్వం, స్టిల్ క్యాప్చర్, వీడియో వైవిధ్యత వరకు ఇమేజింగ్ యొక్క ప్రతి అంశంలో గణనీయమైన పనితీరును పెంచుతుంది.

## యువ భారత్ ఏఐని ఎలా ఉపయోగిస్తోంది?

**విజయవాడ మేజర్ న్యూస్ :** కృత్రిమ మేధస్సు ఇప్పుడు భారతదేశ డిజిటల్ పరివర్తనకు కేంద్రంగా ఉంది. భద్రత, ప్రాప్యత, రోజువారీ సాధికారతను ముందుకు తీసుకెళ్తోంది. ఈ మార్పును ప్రతిబింబిస్తూ, సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో (ఎస్ఎఫ్‌టి) 2025.. ఐఐటీ ఢిల్లీ సహకారంతో సురక్షిత, తెలివైన, సమగ్రమైన భారత్ కోసం ఏఐ అనే థీమ్ కింద వాస్తవ ప్రపంచ ఏఐ పరిష్కారాలను రూపొందించడానికి దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను ఒకచోట చేర్చింది. ఈ సంవత్సరం సురక్షిత, తెలివైన, సమ్మిళిత భారత్ కోసం ఏఐ అనే థీమ్‌లో సామాజిక ప్రభావం, ఏఐ ఆధారిత నిఘా నెట్‌వర్క్‌లు, మహిళల భద్రతా యాప్, రియల్ టైమ్ ఫాల్ డిటెక్షన్, ఈఆర్‌తో మహిళల కోసం ఏఐ ఆధారిత భద్రతా యాప్, అంధులకు రియల్ టైమ్ ఫేస్ రికగ్నిషన్, ఆఫ్‌లైన్ నావిగేషన్ సపోర్ట్‌ను అందించే ఏఐ గ్లాసెస్ ముఖ్యాంశాలుగా ఉన్నాయి. బెంగళూరు విద్యార్థి తుషార్ షా నేతృత్వంలోని పెర్స్పివియా అగ్రశ్రేణి బృందం ఈ థీమ్ కింద ఏఐతో ఆధారిత కళ్ల జోళ్లను సృష్టించింది. విజేతలు ఐఐటీ ఢిల్లీలో 1 కోటి రూపాయల వరకు ఇంక్యుబేషన్ మద్దతును అందుకున్నారు. అలాగే అగ్రశ్రేణి జట్లకు 1 లక్ష రూపాయల గ్రాంట్లు, గుడ్‌విల్ అవార్డులు, యంగ్ ఇన్నోవేటర్ అవార్డులు, గెలాక్సీ జెడ్ ఫ్లిప్స్మార్ట్‌ఫోన్‌లతో సహా అదనపు అవార్డులను అందుకున్నారు.

## ఉపాధి హామీ పనిని ప్రారంభం చేసిన వేములకొండ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం పినపాక గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ పనుల్లో భాగంగా నేటి ఉదయం నుంచి పంట కాలువల పూడికతీత పనులు మెదలు పెట్టగా వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గరికపాటి స్వామిదాసు పాల్గొన్నారు.

# మీకోసం అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందే మీకోసం అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి వారి దరఖాస్తులను వెంటనే విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్లో జిల్లా యంత్రాంగం 201 అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఇంకను 284 అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు ఇంకను చూడకపోవడం సరైనది కాదని స్పష్టం చేస్తూ ఇకనైనా వెంటనే చూసి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకను 128 అర్జీలు గడువు దాటి ఉన్నాయని వాటిని అత్యంత ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీలను ఆడిట్ కూడా చేయాలన్నారు. జిల్లా అధికారులు పారి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ భారతీయ స్టేట్ బ్యాంకులో జీతాలకు సంబంధించిన ఖాతా ఉంచుకునేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. తద్వారా వారు మంచి ఆర్థిక ప్రయోజనాలు పొందుతారన్నారు. ఆర్టిజిఎస్ కు సంబంధించి మండలాలతో కలుపుకొని ప్రగతి చూస్తున్నందున క్షేత్రస్థాయిలో కూడా అధికారులందరూ వారికి సంబంధించిన ఉత్తర్వులు వివిధ రకాల పత్రాలను ఆర్టిజిఎస్ లో అప్లోడ్ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విజయ గాథలను గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధిపతికి అందజేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చెందిన చాలా కోర్టు కేసులు ఇంకా పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా వచ్చే ఉద్యోగుల గ్రీవెన్స్ రోజు లోగా పరిష్కరించాలన్నారు. ఈసారి నూతన సంవత్సరం వేడుకలు పుష్పగుచ్ఛాలు, శాలువలు, మిఠాయిలతో కాకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో వారికి సానిటరీ ఇన్సినేటర్స్ కొనుగోలుకు, కింద కూర్చుని చదువుకునే విద్యార్థులకు చలికాలంలో ఇబ్బంది లేకుండా చాపలు, చదువుకునేందుకు ప్లాంకులు ఉపకరణాలు అందించే విధంగా జిల్లా అధికారులు వారి సిబ్బంది ముందుకు రావాలన్నారు..ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ డ్వామా పిడీలు హరిహరనాద్, శివప్రసాద్, డీఎస్ఓ మోహన్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం శివరామ్ ప్రసాద్, డిఎం అండ్ హెచ్ ఓ డా. యుగంధర్, డిపిఓ డా.జె. అరుణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, ఆర్ అండ్ బి ఈ లోకేష్, ఐ సి డి ఎస్ పిడి ఎంఎన్ రాణి, సర్వే భూ రికార్డుల ఏ డి జోషీలా, మార్కెఫెడ్ డి ఎం మురళీకృష్ణ, మార్కెటింగ్ ఎడి నిత్యానందం తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మీకోసం ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వండి



### జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రథమ ప్రాధాన్యంగా తీసుకొని,వారికి న్యాయం అందించడం పోలీసు శాఖ యొక్క ముఖ్య ధ్యేయమని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎస్పీకి తెలియజేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ విని,చట్ట పరిధిలో పూర్తి స్థాయి విచారణ జరిపి తప్పనిసరిగా పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు చేసిన ప్రతి ఫిర్యాదు విషయంలో, సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ, వారి సమస్యను పూర్తిగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రజలు ఏ సమస్య గురించైనా ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## అనాథ పిల్లలకు ఆరోగ్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అనాథ పిల్లలకు ఆరోగ్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్టీఆర్ వైద్య సేవల అమృత ఆరోగ్య పథకం కింద 17 అనాథ ఆశ్రమాలకు చెందిన 82 మంది అనాథ పిల్లలకు జిల్లా కలెక్టర్ ఆరోగ్య కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మంజూరు చేసిన ఈ ఆరోగ్య కార్డుల ద్వారా ఆరోగ్యశ్రీ కార్డుల మాదిరిగానే అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా వైద్య చికిత్సలు పొందవచ్చన్నారు. ఈ కార్డులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి పలువురు అనాథ పిల్లలు పాల్గొన్నారు.

## శాఖాధిపతులు స్వయంగా ప్రజల ఫిర్యాదులను పరిశీలించాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజలకు శాశ్వతమైన పరిష్కారాలు అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రధాన కార్యాలయం తో పాటు జోనల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా ఫిర్యాదులను పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తూ మూడు కార్యాలయాల అధికారులతో గతవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పరిష్కరించిన దరఖాస్తులపై సమీక్షించారు. మున్సిపల్ సేవల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పురమిత్ర యాప్లో స్వీకరించిన ఫిర్యాదులను, అధికారులు పరిష్కరించిన తీరును సమీక్షించారు. ఎప్పటికప్పుడు పురమిత్ర ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి ఫిర్యాదులో నాణ్యమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని, ప్రజ లకు పరిష్కారం చూపించాలే తప్ప వేరే శాఖపై సమస్య ను మళ్లించ కూడదని అధికారులను హెచ్చరించారు. శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని వచ్చిన ప్రతి ఫిర్యాదు శాఖల సమన్వయంతో పరిష్కరించాలని కమిషనర్ అన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖాధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యా దుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వ తమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 25 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజనీరింగ్ 10, రెవిన్యూ 3, పబ్లిక్ హెల్త్ 2, హార్టికల్చర్ 1, పి ఓ (యుసిడి) 1,ఎస్టేట్ 3, హౌసింగ్ మాపింగ్ 1 మొత్తం కలిపి 25 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రభాకర్, బయోలజిస్ట్ కామేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్,డిఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## గుడ్లవల్లేరు లయన్స్‌కు అవార్డుల పంట

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఉత్త మ సేవలను కనబరిచిన లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారు అవార్డుల పంట పండించారు. గతేడాది ఉత్తమ సేవలు అందించిన స్థానిక లయన్స్ క్లబ్ వారికి ఆదివారం రాత్రి విజయవాడ జిల్లా లయన్స్లో ఉత్తమ అవార్డులను అందించినట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. అవార్డులను అందుకున్న వారిలో లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ ప్రతినిధులు అడుసుమిల్లి వీరభద్రరావు, కళ్యాణపు నవాబు, పుల్లేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గురునానక్ కాలనీలో బేకర్స్ ఫన్ ప్రారంభం

### సీనియర్ ఐఏఎస్ అధికారి నారాయణ్ భరత్ గుప్తా, డా. ప్రమోద్ చలసాని



**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గురునానక్ నగర్ కాలనీ ప్రాంత వాసులకు బేకర్స్ ఫన్ నుంచి తాజా బేకరీ ఫుడ్స్, క్రిస్మస్, కొత్త సంవత్సర కేకులు విభిన్న రుచులలో ఇక మీదట అందుబాటులో ఉంటా యని డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, సీనియర్ ఐఏఎస్ అధికారి నారాయణ్ భరత్ గుప్తా చెప్పారు. గురునానక్ నగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటుచేసిన బేకర్స్ ఫన్ను ఆయన ప్రారంభించారు. బర్త్ డే కేకులు, యానివర్సరీలు, ఇలా ఏ సంద ర్భానికైనా సరిపోయే వివిధ రకాల కేకులు ఇక్కడ అందుబాటులో ఉంటా యని, పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చే ఫ్లేవర్లు ఇక్కడ ఎంచుకో వచ్చని బేకర్స్ ఫన్ డైరెక్టర్ శేషు అన్నారు. ఇప్పటికే కానూరులో తమ శాఖ ఒకటి ఉండగా, ఇప్పుడు గురునానక్ నగర్ కాలనీలో రెండోది ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరానికి చెందిన ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రమోద్ చలసాని మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఇప్పటివరకు మంచి బ్రాండెడ్ బేకరీ లేదన్న లోటు ఉండేదని, ఇప్పుడు బేకర్స్ ఫన్ రాకతో అది కూడా తీరిందని తెలిపారు. ఫ్రాంచైజీ యజమాని, పొన్నూరుకు చెందిన దంతవైద్య నిపుణుడు డాక్టర్ బ్రహ్మం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాలీబాల్ జట్టుకు కెయూ ఇంజనీరింగ్ విద్యార్థి ఎంపిక



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా విశ్వవిద్యాలయం వాలిబాల్ జట్టుకు కెయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. డిసెంబర్ 10 నుంచి 14 వరకు కాకినాడ జెఎన్టియు ఆధ్వర్యంలో జరిగే దక్షిణ భారత వాలీబాల్ పురుషుల టోర్నమెంట్ కు కృష్ణా విశ్వవిద్యాలయ వాలీబాల్ జట్టులో మూడవ సంవత్సరం కెయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి జి. మహేష్ బాబు ఆడనున్నాడు. జట్టులో ఎంపికైన విద్యార్థి నీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్ విజయ్ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ పర్చూరి గోపి అభినందించారు.

## గోపు ఆధ్వర్యంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ అవగాహన




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కానూరు పంచాయతీలోని పెద కానూరులోని కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ వారు కానూరు గ్రామంలో గ్రామ పెద్దలు, రొయ్యల పరిశ్రమ, మత్స్యకార కుటుం బాలకు పని ప్రదేశంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పిపి కిట్ల గురించి అలాగే రాష్ట్ర, సెంట్రల్ గవర్నమెంట్ గవర్నమెంట్ పథకాలు గురించి అవ గాహన కల్పించడం జరిగింది.అదేవిధంగా డ్వాక్రా గ్రూపుల మహిళలు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేతనం ఎలా తయారు చేసుకోవాలో గ్రూప్ సభ్యులు లోను ద్వారా వచ్చిన అమౌంట్ ని చిన్నచిన్న కుటీర పరిశ్ర మలు ఎలా పెట్టుకోవాలో వివరించడం జరిగినది.అదే విధంగా హార్ట్ ఎటాక్ గురించి సి పి ఆర్ ఎలా చేయాలో గ్రామ ప్రజలకు మాలిక్యూర్ ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రశేకర్,హరి కృష్ణ,జి ఎస్ రాజు, పి.సాం బయ్య, దివి మహేష్,పీత రాము,బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, విజయ్,బుక్ కీపర్లు, ఎ ఎన్, యంలు,ఆశ వర్కర్స్,మత్స్య సహాయకులు బండి వీరస్వామి అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వారు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ అందజేత



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నిడుమోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 43 మంది విద్యార్థులకు అదే పాఠశాలలో మ్యాథ్స్ టీచర్గా పనిచేయుచున్నయు టి యఫ్ మొవ్వ మండల ఉపాధ్యక్షురాలు యస్.నీలిమ యు టి యఫ్ ముద్రించిన ఎస్ ఎస్ సి స్టడీ మెటీరియల్ ను విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు, యు టి యఫ్ కార్యకర్తలు మంజూష, ఎ.రాజేంద్ర ప్రసాద్, జి.బాబు,ఎ.యస్.యస్.కుమార్లు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చాలా గొప్ప కార్యక్రమం

## ఎమ్మెల్యే గద్దె రామమోహన్





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అనేది చాలా గొప్ప కార్యక్రమమని, వేల మందికి వందల కోట్ల రూపాయాలను వైద్య సహాయానికి కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం తూర్పు నియో జకవర్గ పరిధిలోని 21వ డివిజన్ కృష్ణలంక సత్యం గారి హోటల్ దగ్గర వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా 30 మందికి మంజూరైన రూ.36,64,880ల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందచేశారు. ఇదే కార్యక్రమంలో తాడిశెట్టి సోముకి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు, 19వ డివిజన్ చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త పేరుపోగు రవి మరణించడంతో, వారి కుటుంబ సభ్యలకు గద్దె రామమోహన్ రూ.25,000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది చాలా గొప్ప కార్యక్రమమని తెలిపారు. ఈ పథకం పేదలకు ఆర్థికంగా అండగా ఉండే మంచి కార్యక్రమమని చెప్పారు. అంత గొప్ప కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన కార్యక్రమం అనే ఒకే ఒక్క కారణంతో పేదలకు ఎంతో మేలు చేసే ఈ సీఎంఆర్ఎఫ్‌ను వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నిలిపివేశారని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకమే కాకుండా అన్నా క్యాంటీన్లను కూడా రద్దు చేశారన్నారు. కార్మికులు, పేదల ఆకలిని తీర్చే అన్నా క్యాంటీన్లను తొలగించడం వల్ల పేదలు చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రోజువారి కూలీలు, కార్మికులు అన్నా క్యాంటీన్లలో ఆహారాన్ని తిని కడుపునింపుకునే వారన్నారు. పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వారు పేదలకు అండగా ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సొంత ఖర్చులతో వైద్య చికిత్సలు చేయించుకున్న వారు అప్పుల పాలై ఇప్పటికీ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి కాలంలో తాము వైద్య చికిత్సలు చేయించుకున్నామని, తమకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయాల్సిందిగా ఆసుపత్రికి చెందిన బిల్లులను తీసుకుని ఇప్పటికీ తన కార్యాలయానికి చాలా మంది ప్రజలు వస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్రమోడి కలిసి ఈ నిధులను పేదలకు అందచేస్తున్నందుకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ సొంత ఖర్చులతో వైద్య చికిత్సలు చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను అందచేయడం సంతోషకరంగా ఉందన్నారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని ఆసుపత్రులకు వెళితే కోట్ల రూపాయిలు తమకు బకాయిలు ఉన్నాయని వైద్యం చేయమని ప్రవేటు ఆసుపత్రి వైద్యులు చెప్పి రోగులను వెనుక్కు పంపేవారన్నారు. పది వేల నుంచి లక్ష రూపాయల చెక్కు వరకు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అందచేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటుగా తన సొంత నిధులతో కూడా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. బీజేపీ నాయకుడు కోలపల్లి గణేష్ మాట్లాడుతూ వేల మందికి వందల కోట్ల రూపాయలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నాగేశ్వరరావు, కొర్ర అప్పన్న, వేములపల్లి రంగారావు, కొవ్వూరి కిరణ్, అడపా నాగేంద్ర, రత్నం రమేష్, కొడాలి సోమేశ్వరరావు, మైలమూరు పీరుబాబు, కేశనం శివ భావన్నారాయణ, పెరుమళ్ళ గురునాధం, నిమ్మల జ్యోతిక, మండల మల్లేష్, కోదూరు పవన్, వేముల భవాని, ఇతర డివజన్ల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

## చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు ఆవరణలో సహకార ఉద్యోగుల ధర్నా



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు ఆవరణలో సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నాచేపట్టారు. జీవో 36 అమలుపరిచి 2019, 2024 తాలూకా పెండింగ్లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలనీ, గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్టప్రకారం చెల్లింపులు చేయాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి పదవీవిరమణ వయసు 62గా అమలుచేయాలనీ, రూ.5లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య భీమా కల్పించి సర్వీస్లో మరణిస్తే 20లక్షలు కుటుంబానికి చెందేలా టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీద్వారా కుటుంబానికి భరోసా కల్పించాలనీ, 2019 తర్వాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు తోట కృష్ణారావు, చంద్ర రవికుమార్, ఎస్.ఎస్. చక్రపాణి, కంఠంనేని నాగేశ్వరరావు, పుట్టి వెంకటేష్, పి.సోమేశ్వరరావు, వేముల నాగమణి, కోరుకొండ శ్రీనివాసరావు, ఎల్. రమేష్ పాల్గొన్నారు.

# బూత్ బలోపేత ప్రచారంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనలతో బూత్ బలోపేత ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం వెల్లటూరు, కుంటముక్కల గ్రామాల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో తక్కువ మెజారిటీ వచ్చిన బూత్ లలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ గా వచ్చిన రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రవీణ ఆయా బూత్ లలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమంలో జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు (నాని) పాల్గొన్నారు, ఈ సమావేశంలో గత ఎన్నికల్లో తక్కువ మెజారిటీ రావడం పై విశ్లేషణ చేసి బూత్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు, ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ బొర్రా అశోక్, వెల్లటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పచ్చిగోళ్ళ బాలకృష్ణ, సీనియర్ నాయకులు పచ్చిగోళ్ళ రామారావు, గంధం శ్రీనివాసరావు, చింతపల్లి బాబురావు, కారుకొండ శ్రీనివాసరావు, కర్నాటి వెంకయ్య, మోదుగు అంజయ్య, బెజవాడ ఏసుపాదం, ఆలూరి సుధాకర్, మాదు ఆంజనేయులు, వేల్పూరి మరియన్న, చింతపల్లి సుధాకర్, యలిశెల కిషోర్, కుంటముక్కల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూనిట్, బూత్ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు, అనంతరం నూతనంగా నిర్మిస్తున్న వెల్లటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని, గ్రామ అధ్యక్షులు పచ్చిగోళ్ళ బాలకృష్ణ, రాష్ట్ర అబ్జర్వర్ ప్రవీణ తో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశీలించారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే మండలి సహాయం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆర్థిక సహాయం చేశారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రామానగరంలో కుమ్మర్ల బజారుకు చెందిన యర్రారపు లక్ష్మీ తిరుపతమ్మ - వీరాంజనేయులు కుటుంబం నివసించే పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. బాధితులు సోమవారం అవనిగడ్డలో ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వం ద్వారా గృహం మంజూరు చేయించాలని అర్జీ సమర్పించారు. బాధితుల ఆవేదన విన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా పక్కా గృహం మంజూరు చేయిస్తామని తెలిపారు. బాధితులకు ఎమ్మెల్యే రూ.5వేలు ఆర్థికసాయం, దుప్పట్లు, నూతనవస్త్రాలు అందచేశారు.

## మండలి విగ్రహానికి నివాళులర్పించిన వంట గ్యాస్ డీలర్లు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ ఇండేన్ గ్యాస్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక వంతెన సెంటర్లో కృష్ణారావు విగ్రహానికి ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఇండేన్ గ్యాస్ డీలర్లు ఆరే సద్గుణరావు, కోసూరు గోపీచంద్, బచ్చు కుటుంబరావు, గంగు ఫణీంద్ర, హెచ్.పీ గ్యాస్ డీలర్ సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాణక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు.టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి సల్పాలి



**మొవ్వ మేజర్ న్యూస్:** ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు విద్యార్థులు కృషి సల్పాలని మండల విద్యాశాఖ అధికారి-1 ఏ. భాను ప్రకాష్ విద్యార్థులకు హితబోధ చేశారు. సోమవారం మండల పరిధిలోని పెదముత్తేవి లోని ఎస్.ఎల్.ఎస్.వి.ఎస్.ఓ. విద్యాలయంను పరిశీలించి పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. గత విద్యా సంవత్సరంలో స్కూల్ ఫస్ట్ 565 మార్కులురాగా ఈ విద్యా సంవత్సరంలో580 మార్కులు తెచ్చుకొన్న విద్యార్థికి వ్యక్తిగతంగా ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యలను వసతులను గురించిప్రధానోపాధ్యాయురాలు కే.మాధవి ద్వారా వివరాలు సేకరించారు. ఎం ఇ ఓ తోపాటు సిఆర్పిలు సిహెచ్ నాగరాజు, తాతా సమర్పదరావు పాల్గొన్నారు.

## బోధి దినోత్సవం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం కావాలి



**పామర్రు మేజర్ న్యూస్ :** సిద్దార్థ గౌతముడు జ్ఞానోదయం పొందిన బోధి దినోత్సవం ప్రతి మనిషికి ఆదర్శప్రాయం కావాలని, బుద్ధుడుగా మారి మానవత విలువలు పెంపొందించు కోవాలని బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షులు ఇంటేటి వెంకట్ పేర్కొన్నారు, పామర్రు లోని ఫౌండేషన్ కార్యాలయం లో సోమవారం జ్ఞానబోధి దినోత్సవం వేడుక ను ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించగా ఆయన బుద్ధ భగవాన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఐకాన్ గా ఉన్న బుద్ధుడు చిత్ర పటం ప్రతి ప్రభుత్వ కార్యాలయం లో ఏర్పాటు చేసేలా, బుద్ధ జయంతి ని ప్రభుత్వం పెద్ద ఎత్తున అధికారంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సభ్యులు తీర్మానం చేసి నట్లు కార్యదర్శి పిల్లి గంగాధర్ తెలిపారు. మానవత రీజియన్ చైర్మన్ పి.ఎం.ఎస్.ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో ఫౌండేషన్ ప్రతినిధులు కాకి కిరణ్ కుమార్, రాయవరపు వెంకటేశ్వరరావు, మద్దాలి అశోక్ తదితరులు పాల్గొని మాట్లాడి నివాళులు అర్పించి బుద్ధుని ఆశయాల పైన ప్రతిజ్ఞ చేశారు.

## రామబ్రహ్మం చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్యేలు నివాళి



పామర్రు మేజర్ న్యూస్: మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో సోమవారం జరిగిన చలసాని రామబ్రహ్మం చౌదరి పెద్దకర్మ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము పాల్గొన్నారు. వీరు ముందుగా రామబ్రహ్మం చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగడ సానుభూతిని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



పామర్రు మేజర్ న్యూస్ : విద్యుత్ షాక్కు గురై ప్రైవేటు ఎలక్ట్రీషన్ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం బల్లిపర్రు గ్రామంలో ఓ ఇంటి వద్ద స్థానిక చెన్నువానిపురంకు చెందిన విజయబాబు (51) అనే ప్రవేట్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఆ శాఖ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ స్తంభం పైకి వెళ్ళాడు. అక్కడ విద్యుత్ షాక్ తగలటంతో స్తంభం పై నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు విజయ్ బాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి మృతితో స్వగ్రామమైన చెన్నువానిపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం విజయబాబు మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అగ్నిప్రమాద బాధితునికి రావెళ్ల కృష్ణసేవాసమితి సాయం



చల్లపల్లి, మేజర్ న్యూస్ : చల్లపల్లి మండలం రామానగరం కుమ్మరుల బజారులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన యర్రారపు వీరాంజనేయులు కుటుంబానికి రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ రూ. 10వేల ఆర్థికసహాయాన్ని అందచేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఉదయ్ కుమార్ తనవంతు సాయంగా రూ. 10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, సేవాసమితి కార్యదర్శి రావెళ్ల విజయ్, ఉప్పాల బుజ్జి పాల్గొన్నారు.

## కోట ఆదాంకి నివాళులర్పించిన జంపాల



ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ : ఇబ్రహీంపట్నం మండలం కిలేష్ పురం గ్రామం తెలుగుదేశం సీనియర్ నాయకులు కోట ఆదాం అకాల మరణం విచారకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య సోమవారం నాడు వారి స్వగృహంలో కోట ఆదాం భౌతికకాయానికి స్థానిక నేతలతో కలిసి పసుపు జెండా కప్పి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయన చిట్టి బాబు రామినేని రాజా, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు

## చల్లపల్లి గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్



చల్లపల్లి, మేజర్ న్యూస్ : చల్లపల్లి గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ చల్లపల్లి పంచాయ తీ కార్యదర్శి పివి. మాధవేంద్రరావుకు సర్టిఫికెట్ను అందచేశారు. క్లీన్ అండ్ గ్రీన్, సచివాలయ, పంచాయతీరికార్డుల నిర్వహణలను పరిగణలోకి తీసుకుని ఐఎస్ ఓ సర్టిఫికెట్ను చల్లపల్లి గ్రామపంచాయతీని ఎం పికచేశారు. కృష్ణాజిల్లాలో ఆరు పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికెట్లు రాగా, అందులో చల్లపల్లి గ్రామపం చాయతీ ఒకటి కావటం విశేషం. ఇటీవలే స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డును సైతం చల్లపల్లి సాధించిన విషయం తెలిసిందే.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిలుపుదలకు కోటి సంతకాల సేకరణ

### జడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ



ఘంటసాల, మేజర్ న్యూస్ : అన్ని వర్గాల వారికి ఉపయోగకరంగా ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ అంశాన్ని విరమించు కోవాలని సోమవారం జడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని గోగినేనిపాలెంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, గ్రామ సర్పంచ్ కుంపటి సుశీల, వైఎస్సార్సీపీ నేత, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుంపటి శరత్ బాబుల పర్యవేక్షణలో వైద్య కళాశాలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అందరికీ అందుబాటులో ఉండేలా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన వైద్య కాలేజీలను కక్ష సాధింపు చర్యలు, పేద, మధ్య తరగతి కుటుంబాల్లో డాక్టర్లు అయ్యే విద్యార్థుల కలలను కలగానే మిగిల్చేందుకు కుటిల యత్నాలు జరుగుతున్నాయన్నారు. మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి ప్రైవేటీ కరణ పేరుతో బడుగు బలహీన వర్గాల ప్రజలను దోచుకోవాలని, విద్యను దూరం చేయాలని చూస్తే వైఎస్సార్సీపీ ఆయా ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. సర్పంచ్ కుంపటి సుశీల సంతకాలు చేయగా పార్టీ నేతలు. కార్యకర్తలు, మహిళలు, యువత. గ్రామస్తులు కోటి సంతకాల సేకరణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు కె.బసవయ్య. కె. రాజ్యలక్ష్మి, కార్యకర్తలు కె.రాము, కె.పోతురాజు, కె.లక్ష్మణ్, కె.కోటినాగులు, పి.కిషోర్, సీహెచ్.రాము, సీహెచ్.అనిల్, ఎ.నాగరాజు, కె.రమేష్, కె.శ్రీనివాసరావు, కె.నాగార్జున, పి.బాల నాగరాజు, కె.కోటేశ్వరరావు, డి.వంశీ, ఎన్.బెనర్జీ, ఆకురాతి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



పమిడిముక్కల మేజర్ న్యూస్: మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంలో ఉన్న డాక్టర్ వైయస్సార్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ గత నెల రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు పామర్రు మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆదేశాలతో కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ముస్లిం మైనార్టీ పామర్రు నియోజకవర్గ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, స్థానిక సీనియర్ నాయకులు కొంతం శివరామకృష్ణ, మరీదు రాము, ఉప సర్పంచ్ ప్రసాద్, డాక్టర్స్ విభాగం పామర్రు నియోజకవర్గ అధ్యక్షులు దిట్టకవి వెంకట శ్రీనివాసచార్యులు, కొక్కిలిగడ్డ ఆనంద్, షుకూర్ ఖాన్, పరాత్ అబ్బాస్, ఖయ్యుమ్ అలీ, షేక్ అతావుల్లా, చాట్ల కళ్యాణ్, కోటేశ్వరరావు, నాగేంద్రబాబు, చాట్రగడ్డ బన్ను తదితరులు పాల్గొన్నారు.

## పారా బ్యాడ్మింటన్ విజేత అప్పారావుకి కలెక్టర్ అభినందనలు



ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి కి చెందిన పారా బాడ్మింటన్ ప్లేయర్ మైలపల్లి అప్పారావుని కలెక్టర్ లక్ష్మీశా అభినందించారు. గుంటూరులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పారా స్టేట్ లెవల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఎన్టీఆర్ జిల్లా పారా బాడ్మింటన్ ప్లేయర్ మైలపల్లి అప్పారావుని కలెక్టర్ అభినందించారు. ఈ పోటీల్లో మైలపల్లి అప్పారావు సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో స్వర్ణ పతకాన్ని అలానే డబుల్స్ లో సిల్వర్ పతకాన్ని సాధించారు. 2026 జనవరి 13 నుండి 18 వరకు ఈజిప్ట్ లో జరగబోయే అంతర్జాతీయ పారా బాడ్మింటన్ పోటీలకు వెళుతున్నట్టు తెలియజేయగా కలెక్టర్, అంతర్జాతీయ పోటీలకు అవసరమయ్యే ప్రతి సహాయాన్ని తాము అందిస్తామని, పారా క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేసారు. అథ్లెట్లకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని, వీటిని ప్రతి ఒక్కరూ జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఇంకా రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మొగులూరు ఎలీషా, మోసెస్, స్పోర్ట్స్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న కొండపల్లి



కొండపల్లి మేజర్ న్యూస్ : కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్. స్థానిక వార్డులలో పర్యటించి సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయవలసిందిగా మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు కు సూచించారు. అందులో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో స్థానిక కౌన్సిలర్ షేక్ రసూల్ తో కలిసి పర్యటించారు చైర్మన్.ఈ సందర్భంగా రసూల్ వారికి స్థానిక సమస్యలను వివరించారు. ముఖ్యంగా కొండపై ఉన్న నివాసాలకు మెట్ల సౌకర్యం కల్పించాలని, డ్రైనేజీ సమస్య, త్రాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా శుభకార్యాలు చేసుకోవడానికి కమ్యూనిటీ స్థలంలో షెడ్ వేయాలని కోరారు. చైర్మన్ సమస్యలను తెలుసుకొని నివేదికను సిద్ధం చేసి పూర్తి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోవైస్ చైర్మన్ చాటుకుదురు శ్రీనివాస రావు,కౌన్సిలర్ చనుమోలు నారాయణరావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, కరిమికొండ బాలాజీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు సీతమ్మ కన్నుమూత



చల్లపల్లి, మేజర్ న్యూస్ : చల్లపల్లి మండలం రామానగరం బీసీ కాలనీకి చెందిన అంబటి సీతమ్మ(101) కన్నుమూశారు. నూరు సంవత్సరాలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న సీతమ్మ గత రెండు నెలలుగా వయోభారంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఎన్ఐబిసి ప్రముఖులు అంబటి వెంకటేశ్వరరావుకు సీతమ్మ మాతృమూర్తి. అవనిగడ్డ ఎస్ఐబిసి బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్, పలువురు ప్రముఖులు సీతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## మండలి వెంకట కృష్ణారావుకు నివాళులర్పించిన కోడూరు మండలం మత్స్యకార సంఘం



కోడూరు మేజర్ న్యూస్ : కోడూరు ప్రధాన సెంటర్ లో గల మండలి వెంకటకృష్ణారావు విగ్రహం వద్ద సోమవారం కోడూరు మండలం మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి మత్స్యకార సంఘ నాయకులు లంకె భాస్కరరావు, పితా రామ్మోహనావు, విశ్వనాథపల్లి రామకృష్ణ పూలమాలలు వేసి వెంకట కృష్ణారావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ ప్రాంత ప్రజలకు మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషిని గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మత్స్య కారులు పాల్గొన్నారు.

# స్క్రబ్ టైఫస్‌పై జాగ్రత్తలు అవసరం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ఇవి కూడా ప్రధానంగా వ్యవసాయ పనులు చేసే గ్రామీణ ప్రాంతాల్లో జ్వరంతో వచ్చే కేసుల్లో స్క్రబ్ టైఫస్ గుర్తించబడుతోంది. వ్యాధి గురించి స్క్రబ్ టైఫస్ అనేది ఒరియెంటియా సుట్సుగాముషి అనే బాక్టీరియా వల్ల కలిగే వ్యాధి ఇది. ఇది పొలాలు, పొదలు, గడ్డి, చెత్తమేడలు వంటి ప్రదేశాల్లో ఉండే సంక్రమిత 'చిగర్' మైట్ కాటు ద్వారా పిల్లి, ఎలుక వంటి పెంపుడు జంతువులు మనుషులకు సోకుతుంది. సాధారణంగా 6–21 రోజుల లోపు (సరాసరి 10–12 రోజుల్లో) జ్వరం మొదలవుతుంది. అధిక జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, అలసట, కొందరిలో దద్దుర్లు, అలాగే కాటు చోటు వద్ద నల్లటి స్కాట్‌లా కనిపించే 'ఎస్కార్' లక్షణంగా కనిపించవచ్చు.

**జాగ్రత్తలివి :** – పంట పొలాలు, గడ్డి, పొదలు ఉన్న ప్రదేశాల్లో పని చేసే సమయంలో పూర్తి చేతులున్న ఫుల్ చొక్కా, పూర్తి కాలు ఉన్న ఫుల్ ప్యాంటు, బూట్లు వంటి రక్షణ దుస్తులు ధరించాలి.

– దోమల/పురుగుల కాటు నివారణకు మశక నిరోధక లోషన్లు, క్రీములు, స్ప్రేలు వాడాలి.

– పొదలు, చెత్త, గడ్డి దగ్గర లేదా బయట పందిరి(మంచె) మీద, నేలపై బోర్లా నిద్రించకుండా ఉండాలి.

– రాత్రి సమయంలో తప్పనిసరిగా మస్కిటో నెట్ ఉపయోగించాలి.

– 3రోజులకు మించి జ్వరం కొనసాగితే, ముఖ్యంగా దద్దుర్లు లేదా చర్మంపై నల్లటి పూత కనిపిస్తే, స్వయం మందులు తీసుకోకుండా సమీప ప్రభుత్వ ఆస్పత్రికు వెంటనే వెళ్లాలి.

– గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలి.

– స్క్రబ్ టైఫస్ ముందుగానే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి నివారించవచ్చు.

**రెండు కేసుల నమోదు :**



**డాక్టర్ యశస్విని, గుడ్లవల్లేరు పీహెచ్‌సీ వైద్యాధికారి**

గుడ్లవల్లేరు సింగలూరు రోడ్డులో రెండు స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమ్మోదయ్యాయి. ఆ ఇద్దరు రోగులు వైద్యం పొందుతున్నారు. వారికి ఎలాంటి భయం లేదు. చుట్టుపక్కల కేసులున్నా...వైద్యం అందించేందుకు తమ సిబ్బందితో జల్లెడ పట్టిస్తున్నాం. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామం.

**ప్రాణాంతకం కాదు :**



**డాక్టర్ సీఎల్ వెంకట్రావు, ప్రముఖ వైద్య నిపుణుడు**

స్క్రబ్ టైఫస్ అనేది ప్రాణాంకమైన వ్యాధి అని ఎవరూ భయ పడనవసరం లేదు. ఈ వ్యాధి ఎక్కడి నుంచో దిగుమతి కాలేదు. తాము చదువుకున్న రోజుల్లో వైద్య శాస్త్రంలో ఉండే వ్యాధే ఇది. దీని వలన ఏ రోగి చనిపోయిన దాఖలాలు లేవు. ప్రజలు కంగారు పడనవసరం లేదు. కాని ఈ వ్యాధి వచ్చినపుడు వచ్చే జ్వరం, జలుబు వంటి లక్షణాలకు వైద్యులు చెప్పిన మందులు తప్పనిసరిగా వాడాలి.

## ఎస్వీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీమ్ వసంత



**మైలవరం మేజర్ న్యూస్ :** మైలవరం పుర ప్రముఖులు, ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త రాజా ఎస్.వి.సుధాకరరావు జన్మదినం సందర్భంగా మైలవరంలోని దివానంలో వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీస్సులు అందుకున్న టీమ్ వసంత.టీమ్ తెలుగుదేశంపార్టీ నాయకులు. ఈ సందర్భంగా పండుగ వాతావరణంలా జన్మదిన వేడుకలను నిర్వహించారుఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు లంక లతీష్, హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగాండ్ల ప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి దూరు బాలకృష్ణ, హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జల్లి కృష్ణ, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ఒరుగు వెంకటేశ్వరరావు, టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు అట్ల తిరుపతిరావు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దినేని శ్రీను, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాజీ,షేక్ సుభాని,షేక్ మమ్ము, షేక్ మస్తాన్, బీసీ నాయకులు బుడిపుటి వెంకటరావు, పరికల సాంబయ్య,యడ్లపల్లి గోవిందరాజులు,యడ్లపల్లి శీను, పోతురాజు శీను, ఆర్ వెంకటేశ్వరరావు, ఎస్సీ సోదరులు కోడి రెక్కల వెంకయ్య, మైక్ బాబురావు, నూతక్కి సతీష్, ప్రత్తిపాటి రవీంద్ర, తొమ్ముంద్రు వినూత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేతన సవరణ చట్టం వెంటనే అమలుపరచాలి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** సహకార ఉద్యోగుల సమస్యల పరిశీలించాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల నాయకులు తుమ్మల ఆదినారాయణ, కొణతం రామకృష్ణ తెలిపారు. సహకార ఉద్యోగుల సమస్యల పరిశీలించాలని కోరుతూ. ఏఐబీఈఏ సీఐటీయు సంయుక్త పిలుపు మేరకు కొడాలి, శ్రీకాకుళం, కొత్తపల్లి, ఘంటసాల, పి ఎస్ ఎస్ ల ఉద్యోగులు సోమవారం వరకు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, 2019 తరువాత జాయిన్ అయిన ఉద్యోగులకు వేతన సవరణను వెంటనే చేపట్టాలన్నారు. సహకార ఉద్యోగులందరికీ 2019,2024 వేతన సవరణ వెంటనే చేపట్టాలన్నారు. అదేవిధంగా డ్యూటీ పద్దులను రద్దు చేయాలన్నారు. ఆరోగ్య భీమా కల్పించాలన్నారు. అదేవిధంగా డిఎల్‌ఎస్‌ఎల్ ద్వారా నిరవధికంగా జీతభత్యాలు చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 36 ను వెంటనే పూర్తిగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. సహకార ఉద్యోగులు సంఘ నాయకులు పి వెంకట్రావు, జె సతీష్,ఏ శివ పార్వతి, కే శ్రీనివాసరావు, ఎం. అర్జున రావు కే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి



**నాగాయలంక డిసెంబర్ 8 మేజర్ న్యూస్ :** దివిసీమ రత్నం మండలి. వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో భాగముగా ఈరోజు షిరిడి సాయిబాబా దేవస్థాన సమీపంలోని ఆ మహానుభావుడి విగ్రహానికి నాగాయలంక మండల గ్రామ వాస్తవ్యులు మండలి. వెంకట కృష్ణారావు అభిమానులు పూలమాల వేసి శ్రద్ధాంజిలి ఘటించినారు. ఈ,సందర్భంగా తెలుగు భాష కొరకు, ఎటువంటి ఆడంబర కార్యక్రమాలు లేకుండా ఎటువంటి పూలమాలలు మెడలో ధరించకుండా కాలినడకన దివి ప్రాంత ప్రజల కష్టాలను బాధలను తెలుసుకొనుచు అనునిత్యం ప్రజలలో మమేకమై ఉండే, మహానుభావుడి చేసిన సేవా కార్యక్రమాలు తెలియపరుస్తూ ఆయన ఆశయాలకి అనుగునముగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వారు చేసినటువంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను కొనియాడినారు. ఈ కార్యక్రమానికి నాగాయలంక బండ్రెడ్డి హరి మల్లికార్జున్ రేమాల.బాబురావు మర్రిపాలెం మాజీ సర్పంచ్ బండ్రెడ్డి బోసు నాగాయలంక మార్కెటింగ్ యార్ట్ సభ్యులు ఉప్పల.ప్రసాద్ తాడేపల్లి వెంకట పాపారావు తలశిల. రాఘవరావు తానంకి చంటి రేమాలవారిపాలెం ఉపసర్పంచ్ పేర్ల భీమేశ్వరరావు సబ్మినేని మహేష్ నంగేగడ్డ వాస్తవ్యులు సనకా శేషు, దోవారి ప్రభాకర్ భోగాది. సతీష్ మాదివాడ అర్జున్ రావు తలశిల రామకృష్ణ (చౌదరి మాస్టర్ ) తలశిల.శివశంకర్ షేక్ జానీ పాల్గొని అనంతరం మిఠాయిలు పంచి కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## కార్యాలయాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్



**మైలవరం, మేజర్ న్యూస్ :** సూఫీ సేవా సదన్ కార్యాలయాన్ని సందర్శించిన కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిన్నబోయిన చిట్టి బాబు, కొండపల్లి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని మైలవరం మండల పార్టీ అధ్యక్షులు జె గోపాల్ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిన్న బోయిన చిట్టిబాబు మాట్లాడుతూ సూఫీ సేవా సదన్ గత 20 సంవత్సరాలుగా పేదవాళ్లకు చేస్తున్న సేవా కార్యక్రమాలను మన అందరి సహాయ సహకారాలు ఉంటాయని అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయటం వల్ల సమాజంలో మంచి జరుగుతుందన్నారు.సూఫీ సేవా సదన్ చైర్మన్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఫైజాన్ కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిన్నుబోయిన చిట్టిబాబు కు శాలువాతో సత్కరించి 20వ వార్షికోత్సవ మెమెంటో అందించారు. షేక్ మొహమ్మద్ ఎస్డాన్, సూఫీ సేవాసదన నిర్వాహకులు షేక్ మొహమ్మద్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ వి ఎస్ జమిందార్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**మైలవరం, మేజర్ న్యూస్ :** మైలవరం జమిందార్, ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త, పాలక మండలి చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు కి సీనియర్ పాత్రికేయులు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యు.వెంకట్రావు ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్ట్స్ మిత్రులు 85వ జన్మ దినోత్సవం సందర్భంగా సోమవారం మైలవరంలోని ఆయన స్వగృహానికి వెళ్ళి పుష్ప గుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించి,కేక్ కట్ చేయించారు. పాత్రికేయులుఈ సందర్భంగా రాజా ఎస్వీ సుధాకరరావు ఇటువంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ ప్రసాదరావు, మైలవరం సీఐ చంద్రశేఖర్, యు.వెంకట్రావు తో పాటు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండీ నాగ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు మన్నే సాంబశివరావు, వైవీ కృష్ణ ప్రసాద్, పరంగి మురళి, పాత్రికేయ మిత్రులు మట్ట రవి, శ్రీనివాసరావు, కోయా శివరామకృష్ణ, బత్తుల శ్రీనివాసరావు, వజ్రం, ఎండిఅక్బర్, ప్రకాష్, డేవిడ్, ఎండి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించండి

**గిల్లాలు మినిస్ట్రీస్ వారి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ**



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల గ్రామంలో గిల్లాలు మినిస్ట్రీస్ వారి 68వ వార్షిక క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నారు. గిల్లాలు మినిస్ట్రీస్ వారి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను పాస్టర్ వెంకటరత్నం ప్రార్థన చేసి ఆదివారం రాత్రి ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని, నీకున్న దానిలో మరొకరికి దానం చేయాలని, ఆయన బోధించారని, ఆయన బోధనలే ఈ సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని ఆయన పేర్కొంటూ క్రైస్తవులు ఈ సమాజానికి ఆదర్శవంతంగా నిలుస్తూ దేశ సమగ్రాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు, పాస్టర్లు పి. నతానియేలు, కె.దైవ ప్రకాష్ బాబు, దానియేలు రాజు, నవీన్ బాబు, ఎస్.సుందర్ సింగ్, వై.మధు, జె.జీవన్, కె.డావి, కె.సతీష్ పాల్, గొర్రెపాటి రంగారావు, గొర్రెపాటి చంటి బాబు, ఘంటసాల, తాడేపల్లి, బోళ్లపాడు, తదితర ప్రాంతాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనంతో మానసిక ఒత్తిడి దూరం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల యు వి ఆర్ గొర్రెపాటి స్కూల్‌లో ఎన్.ఎస్.ఎస్. స్వచ్ఛంద సేవకులు బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో వ్యవసాయానికి సంబంధించిన చిత్రలేఖనం, క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో 6 నుండి 8వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రలేఖనం, క్విజ్ ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుందని పేర్కొన్నారు. డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఏ.జే. సువర్ణత, డాక్టర్ జి. విజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేత లు నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ప్రధానోపాధ్యాయులు లోయ నాగేశ్వరావు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

## నిరుపేదలకు ఆదుకోవడమే ధ్యేయం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** నిరుపేద ప్రజలకు తమ వంతు కృషి చేస్తానని జరపల బిచ్చ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రిటైర్ మేనేజర్ జరపలా చాందియా పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తండాలో ఆదివారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరబలా బిచ్చ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేద ప్రజలకు ఆపన్న హస్తం అందించటానికి కృషి చేస్తామన్నారు.

# సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జిఓ నెం.36 వెంటనే అమలుపరిచి డి.ఎల్.ఎస్.ఎఫ్. ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా సహకార బ్యాంకు ఎదుట మండల పరిధిలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళన**



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** సోమవారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక జిల్లా సహకార బ్యాంకు ఎదుట మండల పరిధిలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిఓ నెం.36 వెంటనే అమలుపరిచి డి.ఎల్.ఎస్.ఎఫ్. ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జి. ఓ నెం. 36 వెంటనే అమలుపరిచి, మా ఉద్యోగస్థులందరికి ప్రొసిడింగ్స్ ఇచ్చి డి.ఎల్. ఎస్.ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి, ఉద్యోగులకు ప్రతి 5 సంవత్సరాలకు వేతన సవరణ చేయవలసి ఉండగా ఇప్పటి వరకు జరగనందున 2019, 2024 తాలుకు పెండింగ్ లో వున్న వేతన సవరణలు చేయాలని అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని కోరుచున్నాము.ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సిలింగ్ విధించి 2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని కోరుచున్నాము.సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు అమలు పరుచుకోవచ్చని చట్టం లో వున్నది. ది. ఓ నెం. 36 లోను ప్రభుత్వం అనుమతించినందున మా ఉద్యోగులందరికి ప్రభుత్వ ఉద్యోగులకు అమలగుచున్న 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయస్సు అమలుపరదాలని కోరుచున్నాము. ఉద్యోగి సర్వీస్ లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారము లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి 20 లక్షలు టర్మ్ ఇస్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని అనేక సంఘాలలో ఉద్యోగుల జీతాలను డ్యూటులో ఉంచడం జరిగింది. కార్మికుడు పనిచేస్తే జీతం చెల్లిస్తారు ఆ జీతాన్ని తిరిగి కట్టాలి అనే విధానం ఏ డిపార్ట్మెంట్ లోనూ లేదు. అందు వలన ఉద్యోగుల డ్యూటు పద్దులను రద్దు చెయ్యాలి. 2019 తరువాత సంఘాలలో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని కోరాము. ది. 01.03.2019 నుండి పి.ఏ.సి.ఎస్ లకు హెచ్.ఆర్ పాలసీ అమలు చెయ్యనందున ఆయా పాలక వర్గాలు సంఘాల పని కుంటుపడకుండా ఉండాలని ఉద్యోగులను నియమించారు. ఈ తాత్కాలిక ఉద్యోగులు సొసైటీ వర్క్ లో, కంప్యూటరీకరణ చేయడంలో అనుభవం సంపాదించారు. వీరిని రెగ్యులర్ చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాము.సహకార సంఘాల సిబ్బందికి బదిలీలు చెయ్యాలని జి.ఓ.నెం. 30లో ఉన్నట్లు శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు శాసన సభ సాక్షిగా చెప్పియున్నారు. మా యూనియన్ బదలీలకు వ్యతిరేకం కాదు. ఈ బదలీలు జరగాలంటే డి.ఎల్.ఎస్.ఎఫ్ ను అస్కాట్, డిసీసీబీలు, పీ ఎ సి ఎస్ లతో ఏర్పాటు చేసి 3 సంవత్సరముల నిబందన కాకుండా నిరవదకంగా కొనసాగించి బదిలీలు చెయ్యాలని కోరుచున్నాము.

కెపాసిటీ టూ పే నిభందనలకు సంబంధం లేకుండా ఉద్యోగుల జీతభత్యాలను డీ ఎల్ ఎస్ ఎఫ్ ద్వారా నిరవధికంగా చెల్లించాలి. ప్రస్తుతము పనిచేయుచున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ లేదా క్లర్క్ లను కంప్యూటర్ ఆపరేటర్ సీనియార్టీ ప్రాతిపదికిన జిల్లాలో ఖాళీగా ఉన్న సి.ఇ.ఓ పదవులను వీరిని భర్తీ చేయవలెను. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డీ ఎల్ ఈ సీ ద్వారా రక్రూట్ మెంట్ జరగాలని కోరుచున్నాము.ఉద్యోగుల మార్పుల చేర్పుల బాధ్యతను డీ ఎల్ ఇసి కమిటీ పూర్తిగా బాధ్యత వహించాలి. మా ఉద్యోగుల సమస్యలే కాకుండా రైతుల సమస్యలను కూడా పరిష్కరించి రైతులకు సేవలు అందిస్తున్న మా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి మాకు న్యాయం చెయ్యాలని కోరుతున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యులు అడపా శ్రీనివాసరావు,జోగి శ్రీనివాసరావు, తోకల సుధాకర్ బాబు, అనుమకొండ శ్రీనివాసరావు, చింతకూరి స్వామి, మహమ్మద్ ఇబ్రహీం, డొక్కు వెంకటేశ్వరరావు, అనుమకొండ సాయి సూర్యనారాయణ, కుంభం సుబ్బారావు జి. సత్యనారాయణ, మురారి ప్రసాద్, కుంభం నాగేనల్లేశ్వరరావు, శ్రీకాకుళపు హరీష్, చల్లపల్లి అజయ్ కుమార్, వేము ప్రసాద్, కమ్మెల వాసవి, పీతల ప్రభాకర్ రావు, అడపాల ఉష్శశ్రీ, జొన్నల భవాని, మెట్ల లక్ష్మి, జి సూర్య కుమారీ, ఉషా భార్గవి, ఎం ప్రత్యూష, ఎం జగదీష్ ప్రతాప్, వి వి ఎస్ ఎస్ పవన్ కుమార్, వై డి మనితేజ, సిహెచ్ హనుమాన్, ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక యూనియన్ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య కో ఐపిఎల్ శాఖలో నాసా కిట్స్ పంపిణీ





**విజయవాడ, మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య మొగల్రాజపురం కో ఐపిఎల్ శాఖలో నాసా కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. లయోలా కాలేజీ సీనియర్ ఫిజిక్స్ విభాగాధిపతి సహాయ భాస్కరన్ విచ్చేసి నాసా విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేసి, ప్రస్తుత ఆధునిక సాంకేతికతలో ఏఐ భాగస్వామ్యాన్ని గురించి వివరించి పిల్లలందరూ సాంకేతికతతో తమ ప్రతిభను మెరుగులు దిద్దుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థులను అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యాన్ని ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జి.ఎం. మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ మేడం, అకడమిక్ కో-ఆర్డినేటర్ చక్రధర్, ప్రిన్సిపల్ బేగ్, డీన్ పురుషోత్తం, సి- ఇంచార్జ్ ఫణిదర్, ఫిజిక్స్ విభాగ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

## డీపీఓ డాక్టర్ జె అరుణను, పంచాయతీల ఈవోలను అభినందించిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలో డిపిఓ డాక్టర్ జె అరుణ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించినందుకు 6 గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ 90001 ధ్రువీకరణ పత్రాలు రాగా జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ చేతుల మీదుగా సంబంధిత గ్రామపంచాయతీల ఈవోలు అందుకున్నారు. వాటిలో ఆత్కూరు గ్రామం ఈపంచాయతీ సుపరిపాలన అందించడంలో, కేసరపల్లి గ్రామం కాఫీ షాప్ ద్వారా సొంతంగా రెవెన్యూ సాధించుటలో, బాపులపాడు స్వచ్ఛ రథం నిర్వహణలో, పునాదిపాడు గ్రామం చెత్త నుండి సంపద తయారీలో, నాగాయలంక గ్రామం ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల యాజమాన్య యూనిట్ నిర్వహణలో ఆదర్శంగా నిలవడంతో ఈ ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాలు పొందగలిగాయి.. గ్రామ పంచాయతీలు ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో నాయకత్వం వహించి విశేషంగా కృషి చేసిన డిపిఓ డాక్టర్ జె అరుణను, పంచాయతీల ఈవోలను కలెక్టర్ అభినందించి ఇంకా బాగా పనిచేయాలని వారిని ప్రోత్సహించారు.



## సహకార ఉద్యోగులు కేడీసీసీ బ్రాంచ్ వద్ద నిరసన





**మొవ్వ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక (జేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం మొవ్వ కేడీసీసీ బ్రాంచ్ ఆఫీస్ ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో మండలంలో కాజ,కోసూరు, మొవ్వ, మొవ్వపాలెం, కూచిపూడి, చినముత్తేవి గ్రామాల్లో గల పిఎసిఎస్ లు పనిచేయలేదు. ఉద్యోగులు దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ప్లే కార్డులతో నిరసన తెలిపారు.

జీ వో నెంబర్ 36 ఆమలు పరిచి 2019 నుంచి 2024 వరకు పెండింగ్ లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్యాడ్యూటీ సీలింగ్ లో రెండు లక్షల మాత్రమే చెల్లిస్తున్నారని, గ్యాడ్యూటీ చట్టాన్ని అమలుపరచి చట్టం ప్రకారం గ్యాడ్యూటీ చెల్లించాలని, ఉద్యోగులకు ఐదు లక్షల తక్కువ కాకుండా ఆరోగ్య బీమాను కల్పించి ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటుంబానికి ఆధారములు లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి 50 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని, రిటైర్మెంట్ వయసు ప్రభుత్వం ఉద్యోగులకు అమలయ్యే 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగుల జీత భత్యాలను డ్యూ టు పద్దులను రద్దు చేయాలని, 2019లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి కూడా జీ వో నెంబర్ 36 ను అమలుపరచాలని, డిసి సి బి ల ద్వారా కాకుండా రైతులకు డైరెక్ట్‌గా ఋణాలు పిఎసిఎస్‌ల సంఘాల ద్వారా అందే విధంగా చర్యలు తీసుకోవాలని, సంఘాలు చెల్లించిన షేర్ దనం పై కనీసం ఆరు శాతం డివిడెంట్ లేదా వడ్డీ చెల్లించాలని, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ క్లర్క్, కంప్యూటర్ ఆపరేటర్లను సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న సీఈవో పదవులను వీరితో భర్తీ చేయాలని, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డి ఎల్ ఈ సి ద్వారా రిక్రూట్మెంట్ జరగాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 6 నుంచి 5 జనవరి 2026 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక జేఏసీ మొవ్వ మండల నాయకులు పింగళి వెంకటరమణ, జొన్నలగడ్డ సత్యనారాయణ తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమంలో వడ్డీ జగదీష్, ఏనుగు శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, రాజేష్ లతో పాటు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఒడుగు గంగాధర్ ప్రసాద్, మండల కన్వీనర్ కొడాలి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణ రావు, మండల బిల్లింగ్ వర్కర్స్ నాయకులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999